
ప్రజాశక్తి

బుధవారం 8 మే 2024

I

అల్లూరి సీతారామరాజు



ట్రైబల్ సెల్‌ను పరిశీలించిన డిఎం అండ్ హెచ్‌ఒ

-పలు వార్డుల సందర్శన

ప్రజాశక్తి-పాడేరు: విశాఖపట్నం కేజిహెచ్ లోని ట్రైబల్ సెల్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రైబల్ సెల్ నిర్వహిస్తున్న ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్, డెత్ రిజిష్టరను, బ్లడ్ బ్యాంకు, మందుల పంపిణీ రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడుతూ, ముందుగా క్యాజువాలిటి, ఐసియు, ఒబిజి, జనరల్, పిల్లల వార్డులలో పర్యటించారు. రోగి డిశ్చార్జి సందర్భంలో, మరణం సందర్భంలో అవసరమైన చికిత్స, చర్యలకు డాక్టర్లు వెంటనే స్పందించాలని ఆదేశించారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సేవలను వారు చెపిప్న వెంటనే స్పందించాలని సూచించారు. ఈ తనిఖీలో వైద్యులు రవీంద్ర, సంపత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లూటీదారులను సాగనంపండి

- ఏజెన్సీలో బిజెపి, తొత్తు, పొత్తు పార్టీలను ఓడించండి
- సిపిఎం, ఇండియా బ్లాక్ ప్రచార సభల్లో బృందాకరత్
- అనంతగిరి, అరకు, ముంచంగిపుట్టుల్లో రోడ్డుషో, బహిరంగ సభలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, అనంతగిరి, అరకులోయ, ముంచంగి పుట్టు విలేకరులు

ఏజెన్సీని లూటీ చేస్తున్న బిజెపిని, దాని పొత్తు, తొత్తు పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ పిలుపునిచ్చారు. ప్రజాగళం వినిపించే సిపిఎం, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి, అరకు, ముంచంగిపుట్టుల్లో ఇండియా వేదిక బలపరిచిన అరకు సిపిఎం లోక్‌సభ అభ్యర్థి పి.అప్పలనర్స, అరకు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామికి మద్దతుగా మంగళవారం జరిగిన రోడ్డుషో, బహిరంగ సభల్లో ఆమె పాల్గొన్నారు. సంప్రదాయ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో గిరిజనులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతగిరిలో మహిళలు ఆమెకు బొట్టు పెట్టి తమ అభిమానం చాటుకున్నారు. అరకు పెట్రోల్ బంక్ నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా సిపిఎం, కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీ అరకు బస్ కాంప్లెక్స్ జంక్షన్‌కు చేరుకుంది. ర్యాలీ అగ్రభాగాన బృందాకరత్, ఇండియా వేదిక బలపర్చిన అరకు లోక్‌సభ సిపిఎం అభ్యర్థి పి.అప్పలనర్స, అరకు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు తదితరులు ఉన్నారు. ముంచంగిపుట్టులో తహశీల్దార్ కార్యాలయం రోడ్డు నుంచి సుజనకోట జంక్షన్ వరకూ రోడ్డుషో సాగింది.



అరకులోయలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, చిత్రంలో అప్పలనర్స, గంగాధర్‌స్వామి, నర్సింగరావు

చినుకులు పడినా కార్యకర్తలు ఎర్ర జెండాలు పట్టుకొని సభ పూర్తయ్యే వరకు వున్నారు. ముంచంగిపుట్టు జంక్షన్ వద్ద బృందాకరత్ రాసిన రీటా పాఠాలు పుస్తకాన్ని ప్రదర్శించి, ఆమెకు వెల్కం టు రీటా, ఉయ్ లవ్ రీటా అని ఫ్ల కార్డులతో విద్యార్థులు స్వాగతం పలికారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో బృందాకరత్ మాట్లాడుతూ యుపిఎ-1 ప్రభుత్వంపై వామపక్షాలు ఒత్తిడితెచ్చి సాధించిన అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేలా అటవీ సంరక్షణ చట్టాన్ని మోడీ ప్రభుత్వం సవరించిందని తెలిపారు. బిజెపి ఆదివాసీలకు చేసిన ద్రోహాన్ని వివరించారు.



అరకులోయలో నిర్వహించిన భారీ ర్యాలీలో బృందాకరత్, అప్పలనర్స, గంగాధర్‌స్వామి, లోకనాథం, నర్సింగరావు, సురేంద్ర తదితరులు

నకిలీ ఎస్‌టి కొత్తపల్లి గీతను ఓడించండి : లోకనాథం

సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ అరకు బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత నకిలీ గిరిజనరాలని, ఆమెను ఆదివాసీలు ఓడించాలని పిలుపునిచ్చారు. పదేళ్లుగా ఈ ప్రాంతం నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏనాడూ ఏజెన్సీ సమస్యలపై చట్టసభల్లో అడగలేదన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కొత్తపల్లి గీత బ్యాంకును కూడా టూటీ చేశారన్నారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యారని తెలిపారు.

ఏజెన్సీని కొల్లగొట్టేందుకు కుట్రలు : సిహెచ్.నర్సింగరావు

సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఏజెన్సీలో ఖనిజ సంపదను దోపిడీ చేయడానికే బిజెపి అరకు లోక్‌సభకు తన అభ్యర్థిని నిలిపిందన్నారు. మోడీ మళ్లీ గెలిస్తే ప్రతి ఆదివాసీ గ్రామం ఒక మణిపూర్ అవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

ఆదివాసీలకు తీవ్ర అన్యాయం : పి.అప్పలనర్స

సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స మాట్లాడుతూ బిజెపి పాలనలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీలో అదానీ ఏజెంట్లుగా పనిచేస్తున్న బిజెపి, వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఓడించాలన్నారు. నకిలీ గిరిజనులకు టికెట్లు కేటాయించడం వల్ల అసలైన ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడే ఇండియా వేదిక అభ్యర్థులను బలపర్చాలన్నారు. బాక్సైట్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఘన చరిత్ర సిపిఎందేదన్నారు.

బిజెపి, వైసిపిలు గెలిస్తే ఆదివాసీ ప్రాంతం నాశనం : గంగాధర్‌స్వామి

సభలో కాంగ్రెస్ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో వైసిపి, బిజెపిలు గెలిస్తే ఈ ప్రాంతమంతా నాశనమవుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి, నరేంద్ర మోడీ ప్రభుత్వాలు వస్తే ఈ ప్రాంతంలోని భూములన్నీ అమ్మేస్తాయన్నారు.

ఆయా చోట్ల జరిగిన సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పి.శాంత కుమారి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, పొద్దు బాలదేవ్, పోతురాజు, టోకూరు సర్పంచ్ మొస్య, నాగులు, కె.గోవిందరావు, కొర్రా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో 'రీటా' ప్లకార్డులతో స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



అనంతగిరిలో బృందాకరత్‌కు తిలకందిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు



పాడేరులో కురుస్తున్న వర్షం

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరు

భగభగలాడే భానుడు పాడేరు మన్యంలో మంగళవారం పూర్తిగా శాంతించాడు. మన్యంలో మంగళవారం వేకువ జామునే ఉరుములతో కూడిన వర్షం మొదలయింది. ఉషోదయ వేళలో మొదలైన ఈ వర్షంతో రోజంతా చినుకులు పడుతూనే ఉన్నాయి. వరుణుడి కరుణతో మన్యమంతా ఆహ్లాదంగా చల్లని వాతావరణంతో నిండిపోయింది. పాడేరు పరిధిలో రోజంతా భానుడి వెలుగు గోచరించలేదు. దీంతో ఒక్కసారిగా మన్యమంతా కూల్ కూల్ గా మారింది. ఒకపక్క ఎన్నికల సందడితో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సాగిస్తున్న ప్రచార వేడిని కూడా వర్షం కొంత శాంతింప చేసింది. గత వారం రోజులుగా అడప దడప మన్యంలో కురుస్తున్న వానలకు చల్లదనంతో పాటు ఎండుతున్న ఇంకుతున్న, బావులు బోరు బావులకు కొంత నీరు చేరింది. ఏజెన్సీలో తాగునీటి కొరత ఏర్పడకుండా ఈ వర్షాలు అనుకూలిస్తున్నాయి

వర్షపాతం వివరాలు:-

పాడేరు డివిజన్ ఏజెన్సీలోని వివిధ మండలాల్లో మంగళవారం కురిసిన వర్షపాతం వివరాలు ఇవి అరకులోయ మండలంలో అత్యధికంగా 28..4 మిల్లీమీటర్లు, జిమాడుగుల మండలంలో 18.6 మిల్లీమీటర్లు ముంచంగిపుట్టు మండలంలో 18.2,, కొయ్యూరు మండలంలో 18, పెదబయలు మండలంలో 14.6, అనంతగిరి మండలంలో 14.2, పాడేరు మండలంలో 11.2, చింతపల్లి మండలంలో 6, హుకుంపేట మండలంలో 4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది.

డుంబ్రిగుడ : మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి సుమారు ఎనిమిది గంటల వరకు పిడుగుల శబ్దాలతో కూడిన భారీ వర్షం కురిసింది. బానుడి ప్రతాపానికి ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న గిరిజనులకు ఈ భారీ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. ఈ వర్షంతో వాతావరణం చల్లబడటంతో మండల వాసులు సేద తీరారు.

చింతూరు : చండ్ర నిప్పులు చెరుగుతున్న వేళ, మంగళవారం ఆకాశం మేఘావృతమై కారు మబ్బులతో చిరుజల్లులు కురవడంతో చింతూరు ఏజెన్సీ ప్రాంతం చల్లబడింది. చాలా కాలంగా ఎండల తీవ్రత అధికమై 45 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతకు ప్రజలు పశుపక్షాదులు అల్లాడిపోయాయి. అడవి ప్రాంతంలో నీటి చలమలు కూడా ఎండిపోయి అడవి జీవాలు దాహార్తితో అలమటించాయి. నింగి నేల గాలి నీరు అంతా ఒక్కసారిగా వేడెక్కిపోతూ జీవకోటి మనుగడకు ప్రశ్నార్థకంగా మారింది. ఎట్టకేలకు కారు మబ్బులు ఈదురు గాలులతో చల్లటి వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం చిన్నపాటి చిరుజల్లు కురిశాయి. రోజంతా మబ్బులతో కూడిన వాతావరణం, చల్లటి శీతల గాలులు వీయడంతో ప్రజలు ఉపశమనం పొందారు. నిన్న మొన్నటివరకు ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక ఇళ్లకే పరిమితమయ్యేవారు. ప్రస్తుతం వాతావరణం పూర్తిస్థాయిలో చల్లబడడంతో పాటు వాతావరణ కేంద్రం వర్షాలు పడతాయని ప్రకటించడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వై.రామవరం : మండలంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటల నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. 11 గంటల నుంచి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం కురవడం వలన ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు.



వై.రామవరంలో ఈదురు గాలులతో కురుస్తున్న భారీ వర్షం



అధికారులతో మాట్లాడుతున్న పిఒ

ఇవిఎంల పంపిణీని వేగవంతం చేయండి

ప్రజాశక్తి -పాడేరు: ఇవిఎంల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లను చురుగ్గా చేయాలని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈవిఎంల పంపిణీ, రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులకనుగుణంగా వాటర్ రూఫ్ టెంట్లు వేయాలని చెప్పారు. మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టి, నీటి సదుపాయం కల్పించాలని స్పష్టం చేసారు. ఓట్ల లెక్కింపుకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్తు లైట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. బోర్ల నిర్మాణం వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకుని రావాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షే మ శాఖ ఇఇ, డివిఆర్ ఎం. రాజు, డిఇఇ అనుదీప్, తహశీల్దార్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్‌కు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - చింతపల్లి: చింతపల్లి - నర్సీపట్నం ప్రధాన రహదారి కొలపరి పెద్దగడ్డ గ్రామాల సమీపంలో ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు జాతీయ రహదారి బురదలో ఇరుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సోమ, మంగళవారాలలో కురిసిన వర్షానికి ఎన్‌హెచ్ 516ఏ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఎర్రమట్టి బురద మయమై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ే చింతపల్లి నర్సీపట్నం టూ స్టాప్ బస్సు చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళుతుంది. కొలపరి సమీప రహదారి బురదలో ఇరుక్కొని సుమారు 30 అడుగులు దూరం జారుకుంటూ పోయింది. ఈ సంఘటనతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును భారీ వృక్షం వద్ద నిలుపుదల చేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారి యజమాన్యం స్పందించి రెండు జెసిబి ల సహాయంతో బస్సును సురక్షితంగా రహదారిపైకి తీసుకొచ్చారు.



కూరుకుపోయిన బస్

గ్రామాల్లో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ బోడిగూడ, రంగిని వలస, బిల్లాపుట్టులో స్థానిక పంచాయతీ వైస్ సర్పంచ్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అభ్యర్థుల కరపత్రాలను గిరిజనులకు పంచిపెట్టి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.వెంకట్రావు, కాంతారావు, ఆ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఉద్యమం

ఘనంగా అల్లూరి శత వర్ధంతి



రాజవొమ్మంగిలో నివాళులర్పిస్తున్న సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీలో అటవీ హక్కులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి కోసం పోరాడిన తొలితరం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఆయన స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా మంగళవారం రాజవొమ్మంగి అల్లూరి సెంటర్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సిఐటియు మండల కన్వీనర్ పి.రామరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆ సంఘం నాయకులు పలివెల వీరబాబు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు మరణించి 100 సంవత్సరాలైనా నేటికీ ఆయన పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కోండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, సింగిరెడ్డి అచ్చారావు, రామశేషు, గ్రామ పెద్దలు డి శివాజీ, సూరిబాబు, గుత్తా, ప్రజాసంఘాల నాయకులు టి శ్రీను, వెంకటలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో అల్లూరి శత వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అల్లూరి స్ఫూర్తితో అటవీ సంపద రక్షణకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేతా గోపాలన్, కె.క్రాంతిబాబు, చింతా రాంబాబు, బత్తుల విజయ్ కుమార్, కింతాడ రమేష్, కేతా పద్మ, తూటే సురేష్, ఇంజేటి శ్రీనివాస్, కేతా ప్రమోద్ పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని టేకులబోరులో సీపీఎం నాయకులు అలూరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తాళ్లూరి శ్రీనివాస్, పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరరావు, ఐ.వెంకటేశ్వర్లు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మడివి రవితేజ, ఇల్లెందు నాయకులు కృష్ణ, ప్రజా నాట్య మండలి కళాకారులు కన్నారావు, పద్దం రాజు, వినోద్, బన్ను పండు పాల్గొన్నారు.

వై.రామవరం : స్థానిక మెయిన్ రోడ్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ శాంతిరాజు, రామకృష్ణ మాట్లాడుతూ అల్లూరి ఆశయాలు నెరవేరడంలో పాలకులు విప్లమయ్యారని, ఆదివాసీలకు విద్య వైద్యం, మౌలిక వసతులు అందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్యనారాయణ, ప్రసాద్, వెంకన్న, నాగేంద్ర, ఆంజనేయులు, దుర్గ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని స్థానిక అల్లూరి యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పించారు అనంతరం ఆ సంఘం మండల అధ్యక్షుడు కే.సూర్యప్రకాష్ మాట్లాడుతూ, అల్లూరి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నవసూర్య, కె.ప్రవీణ్, సురేంద్ర, అల్లూరి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చింతపల్లి : మన్య ప్రాంతానికి అల్లూరి సీతారామరాజు చేసిన కృషి ఎనలేనిదని స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేశెట్టి సత్యనారాయణ (సతీష్) అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు శత వర్ధంతిని పురస్కరించుకుని సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్ధంతి కార్యక్రమంలో తోటి పాత్రికేయ మిత్రులతో కలిసి అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి పోరాట స్ఫూర్తి మన్యవాసులలో ఇప్పటికీ, ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు సబిత, వనరాజు, ఉప్పలపాటి బంగారయ్య శెట్టి, సంకు రవి, చోడిశెట్టి శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, పేయ్యల శ్రీనివాసరావు, షేక్ ఖాసిం వల్లి పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో పూలమాల వేస్తున్న యూత్ సభ్యులు

సజావుగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-రంపచోడవరం

మే 13న సజావుగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ యం.విజయ సునీత పేర్కొన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికల స్కూల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్, రంపచోడవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్. చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి 7 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు ఈ పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సరళి ఏ విధంగా ఉన్నదీ ఆమె ఆరా తీశారు. పోస్టల్ బ్యాలెట్ ఉన్న ప్రతి ఉద్యోగి నిర్భయంగా వారికి నచ్చిన అభ్యర్థులకు ఓటు వేయాలని సూచించారు. ఎవరికైనా ఎన్నికల విధులపై సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఈవీఎంలు, వివి ప్యాడ్ల భద్రత స్ట్రాంగ్ రూమును ఆమె పరిశీలించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్లు ఏవి.రమణ, చలపతిరావు, ఎ.కృష్ణజ్యోతి, సత్యనారాయణ, సత్య సులోచన, డిప్యూటీ తహశీల్దార్లు బి.రాజు, స్వామి, బాలాజీ, ఎ సత్యనారాయణ, వీరభద్రరావు, రవీంద్రబాబు, సరిత, విశ్వనాథ్, శ్రీధర్, శివ, సీనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పోలింగ్ అధికారులు ఉన్నారు.



ఎన్నికల ఏర్పాట్లును పరిశీలిస్తున్న అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీత

చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి-సీలేరు :

స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జీకే వీధి మండలం సీలేరులో సోమ, మంగళవారాల్లో సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ పోలీసులు స్థానిక శివాలయం సమీపంలో ఉన్న సీలేరు నదీ పరివాహక ప్రాంతంలో స్నానపుగాటు వద్ద చెత్తా చెదారాలు తొలగించి శుభ్రపరిచారు. అలాగే మారెమ్మ అమ్మవారి ఆలయ పరిసరాల్లో ఇటీవల పండగ సందర్భంగా పేరుకుపోయిన చెత్తా చెదారాలను చీపురులతో ఊడ్చి నిప్పు పెట్టారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ డిఎస్పి సురేష్ మాట్లాడుతూ గ్రామ పరిసరాలతో పాటు ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఎటువంటి వ్యాధులు తలెత్తవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ ఇన్స్పెక్టర్ సుభాష్ కేడీ, సిఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.



సీలేరు నది ఒడ్డును చెత్త తొలగిస్తున్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు

ప్రజలను ప్రేమించేది, వారి పక్షాన నిలబడేది ఎర్రజెండా

పార్టీలకతీతంగా సిపిఎంకు ఓటు వేయాలి

రోడ్ షోలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు


సిపిఎం అభ్యర్థికి మద్దతుగా మాట్లాడుతున్న జెడ్‌పిటిసి మాజీ సభ్యులు రామలక్ష్మి

ప్రజాశక్తి-ఎటపాక

ప్రజలను ప్రేమించేది, వారికి కష్టమొస్తే వారి పక్షాన నిలబడేది ఎర్రజెండా మాత్రమేనని సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలో రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ జెండా ఊపి ప్రారంభించారు. బైక్ ర్యాలీలతో పాటు సాగిన రోడ్ షో లక్ష్మీపురం నుండి ప్రారంభమై గన్నవరం, తోటపల్లి, నెల్లిపాక, చోడవరం, కొండపల్లి, గుండాల కాలనీ మీదుగా ఎటపాక వరకూ సాగింది. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ టిడిపి, వైసిపి అభ్యర్థులు గెలిచినా అసెంబ్లీలో చేతులు కట్టుకొని కూర్చుంటారని, అదే ఎర్రజెండా బిడ్డ గెలిస్తే పిడికిలి బిగించి ప్రభుత్వాన్ని నిలదీస్తారని తెలిపారు. అందువల్ల వైసిపి, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిర్వాసితుల ఎజెండాను ముందుకు తీసుకెళ్తున్న, నిర్వాసితుల కోసం పోరాడుతున్న సిపిఎంకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరూ సిపిఎంకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, నాయకులు గడ్డం స్వామి, ప్రసన్న కుమార్, ఎంపీటీసీ కంటే రాజు, కాంగ్రెస్ డివిజన్ నాయకులు నక్క నరసింహారావు, సిపిఐ నాయకులు వాసం రాము తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం

అడ్డతీగల : మండల కేంద్రంలోని వారపు సంతలో మంగళవారం కళాజాతాలతో నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రచారం సాగింది. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాజీ సభ్యులు పల్లాల రామలక్ష్మి సిపిఎంకు మద్దతు తెలియజేసి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పు రామారావుతోనే మొదలవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.రాజశేఖర్, కేఎస్ శ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు, కే.సింహాచలం, టి.రాజా, నక్కెళ్ల శ్రీనివాస్, ఎం.గంగ సూరిబాబు పాల్గొన్నారు.

రోడ్ షోను విజయవంతం చేయాలి

విఆర్.పురం : సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఈ నెల 9న జరగనున్న రోడ్ షో, కూనవరంలో బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ములకనపల్లి, జీడిపప్పు జోన్‌ల్లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, జల్లి తమ్మయ్య, జల్లి సత్యనారాయణ, కుంజా రాజయ్య, గుండెపూడి లక్ష్మణరావు, చీరపు తాతబాబు, సోడి మల్లయ్య పాల్గొన్నారు.

9న బహిరంగ సభకు తరలిరండి : మంతెన

ప్రజాశక్తి- కూనవరం : ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఈ నెల 9న జరుగు భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 9న విఆర్ పురం, రేఖపల్లి నుండి రోడ్ షో, బైక్ ర్యాలీ ప్రారంభమై కూనవరం జరుగుతుందని, అనంతరం కూనవరం పోలీస్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. ఈ బహిరంగసభలో సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సిపిఐ ఆలిండియా నాయకులు కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రసంగిస్తారని తెలిపారు. ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు గుజ్జా మోహనరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు మండల కేంద్రం మెడికల్ కాలనీలోనూ, మండలంలోని చూటూరు గ్రామంలోనూ సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొడియం లక్ష్మణ్, పి.సుబ్బారావు, సాంబ శివ, నాగార్జున, సుందర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని ములకనపల్లి పంచాయితీ జల్లివారిగూడెం, రేఖపల్లి పంచాయతీ అన్నవరం గ్రామాల్లో సిపిఎం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా లోతా రామారావు, అరకు ఎంపీగా పి.అప్పలనర్సను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, కమ్మ చిచ్చు సత్యనారాయణ పాల్గొన్నారు.

సీలేరు : ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పల నర్సను గెలిపించాలని కోరుతూ జీకే వీధి మండలం చింతలవాడ, కొంద్రుపల్లి, కొండపల్లి గ్రామాల్లో మంగళవారం సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. చింతపల్లిలో బుధవారం జరగనున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ రోడ్ షో, బహిరంగకు అధిక సంఖ్యలో గిరిజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జి.సత్యనారాయణ, కె.బోడయ్య పడాల్, ఏ.కొండబాబు, సిహెచ్.రామలింగం, ఎల్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.


జికె.వీధి మండలంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఇన్ గేట్ వద్ద సోమవారం రాత్రి కారు ఢీకొని ఒక మహిళ మృతిచెందింది. సుమారు 55 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసున్న మహిళ రైల్వే గేటు వద్ద భిక్షాటన చేస్తుండగా AP39 TA 2895 కారు కాన్వెంట్ జంక్షన్ నుంచి వస్తూ ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోలీసులు కెజిహెచ్ శవాగారానికి తరలించారు. మహిళ గురించి తెలిసినవారు నాలుగో పట్టణ పోలీసులను సంప్రదించాలని ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ కోరారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని జెవి.అగ్రహారం గ్రామానికి చెందిన తన భర్త చుక్క అప్పలనాయుడు (పెయింటర్) ఈ నెల 5వ తేదీ నుంచి కనిపించడంలేదని భార్య భవానీ మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భవానీ ఓ ప్రైవేట్ సంస్థలో హౌస్ కీపింగ్ పనిచేస్తున్నారు. ఈ నెల 5వ తేదీన ఉదయం పనికి వెళ్లిన ఆమె సాయంత్రం 6గంటలకు ఇంటికి వచ్చారు. తన భర్త ఇంట్లో లేకపోవడంతో ఎక్కడకు వెళ్లారని అత్తను అడిగారు. మోటారు సైకిల్‌పై వెళ్లారని, ఎక్కడకు వెళ్లారో తెలియదని ఆమె అత్త బదులిచ్చారు. స్నేహితులు, బంధువులు ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. అప్పలనాయుడు ఎత్తు 5అడుగులు, నీలం రంగు చొక్కా, గ్రీన్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. టెన్త్ వరకు చదివాడు. అచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెటర్ల ప్రతిభను గుర్తించేందుకు ఎసిఎ చర్యలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : అట్టడుగు స్థాయి క్రికెటర్లలో ప్రతిభను గుర్తించేందుకు వీలుగా రైజింగ్ స్టార్స్ పేరిట ఎసిఎ ఒక వేదికను అందిస్తోందని, వీటిని ప్లేయర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్ రెడ్డి సూచించారు. ఈ నెల 10వ తేదీన మూడు ప్రాంతాల్లో ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వైజాగ్‌లోని- డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ - వీడీసీఏ క్రికెట్ స్టేడియం "బి" గ్రౌండ్, గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ స్టేడియం, కడప నగరంలోని వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియంలలో ట్రయల్స్ జరగనున్నాయని వివరించారు. 10వ తేదీన ట్రయల్స్ కోసం ప్లేయర్‌లు రెండు వేర్వేరు సమయాల్లో స్లాట్‌లను ఎంచుకోవచ్చని తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఉంటాయని వివరించారు. 18 నుంచి 28 మధ్య వయసున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. గత ఏడాది ఏ ఇతర రాష్ట్రానికీ ప్రాతినిధ్యం వహించి ఉండకూడదని వివరించారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 9 నుంచి 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్లేయర్ ఈ లింక్ http://15.206.63.242/AC/playerOpenRegistration/form ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

యాజమాన్య కుట్రలను తిప్పికొడదాం

ప్రజాశక్తి-ఉక్కునగరం

స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి ఆర్థికంగా కార్మికులను కష్టాలు పాల్జేసి బలవంతంగా ప్రయివేటీకరణవైపు నెట్టాలని చూస్తున్న యాజమాన్య కుట్రలను తిప్పికొట్టేందుకు కార్మికుల పెద్ద ఎత్తున తరలిరావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలకు మంగళవారం నాటికి 1181వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ సిఆర్ఎంపి, సిఎంఎం, సిఇడి, లూబ్రికేంట్స్, హైడ్రాలిక్స్ విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ, రాజకీయంగా కార్మికులను వాడుకోవాలని చూస్తున్న నాయకులే తప్ప చిత్తశుద్ధితో స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం పనిచేస్తున్న నేతలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్రధాని మోడీ సభలో స్టీల్‌ప్లాంట్ అంశంపై ఎవరూ ప్రశ్నించలేదన్నారు. ఇప్పటికైనా రాజకీయ నేతలు మనోగతాన్ని తెలుసుకొని కార్మికులే స్వయంగా పోరాడి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

2,672 మంది ఉద్యోగుల ఓటు హక్కు వినియోగం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించిన వివిధ కేటగిరీల అధికారులు, సిబ్బందిలో మంగళవారం 2672 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగులో నేటివరకు 7512 మంది జిల్లాకు, ఇతర జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. అదేవిధంగా పాడేరు నియోజకవర్గంలో ఇద్దరు 85 సంవత్సరములు పైబడిన వయసు గల ఓటర్లు హోమ్ ఓటింగ్ ను వినియోగించుకున్నారని తెలిపారు. దీంతో హోమ్ ఓటింగ్ పూర్తయిందని మొత్తం 202 మంది 85 సంవత్సరములు వయసు పైబడిన, పిడబ్ల్యుడి ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అరకు వ్యాలీ నియోజకవర్గం లో 870 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడంతో ఇప్పటివరకు 2242 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాడేరు నియోజకవర్గంలో 998 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడంతో ఇప్పటివరకు 2297 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరో ఇద్దరు హోమ్ ఓటింగ్ వినియోగించుకున్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో 692 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడంతో ఇప్పటివరకు 2973 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ వివరించారు.

తమిళనాడులో ఛత్తీస్‌గఢ్ వలస కూలీ మృతి


మృతి చెందిన బాలచంద్ కస్యబ్

ప్రజాశక్తి-చింతూరు : పొట్ట చేత పట్టుకొని తమిళనాడుకు కూలి పనికి వెళ్లి చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన బాలచంద్ కస్యబ్ అనే వ్యక్తి మృతి చెందారు. వారం రోజుల క్రితం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కొండగావ్ నుండి తమిళనాడుకు కూలి కోసం వెళ్లారు. అక్కడ బాలచేంద్ కష్యాబ్‌కు ఫిట్స్ రావడంతో యజమాని ఆసుపత్రిలో చూపించకుండానే ఇంటికి పంపించేశారు. స్వగ్రామం వచ్చే క్రమంలో మార్గ మధ్యలో బస్సులోనే చనిపోవడంతో సహచరులు చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. తన తండ్రి వారం రోజుల క్రితం తమిళనాడు వెళ్ళేటప్పుడు బాగానే ఉన్నారని, ఇప్పుడు పిట్స్ వచ్చి చనిపోయారని చెబుతున్నారని బాలచేంద్ కష్యాబ్ కుమారుడు సైన్ కష్యాబ్ వాపోయాడు. అసలు ఏమి జరిగిందో తెలియడం లేదన్నారు. చత్తీస్‌ఘడ్ జగ్దల్‌పూర్ ప్రాంతాల నుండి వేల సంఖ్యలో రోజువారీ కూలీలు పొట్ట చేత్తో పట్టుకుని తమిళనాడు వంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. వీళ్లను తీసుకెళ్లే బ్రోకర్లు వారి ఆరోగ్యాల గురించి పట్టించుకోవడం లేదు. ఇంకా ఎన్ని ప్రాణాలు గాలిలో కలిసి పోవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో కూలి పనులు కల్పించి కూలీల అక్రమ రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ముమ్మరంగా దోమల నివారిణి పిచికారీ


ఇళ్లల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న మలేరియా సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంప్, జిడిసి క్యాంప్, లాక్కున్‌పుర్, చంద్రుపల్లి గ్రామాల్లోని ప్రతి ఇంట్లోనూ మంగళవారం దోమల నివారణకు ఏసియమ్ మందును ప్రతి ఇంటి లోపల పిచికారీ చేశారు. దోమల వలన మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల వ్యాప్తి, వాటి నిర్మూలనపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్సి వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, సౌమ్య మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే డ్రై డే ఫ్రైడే ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, దోమతెరలు వినియోగించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, గుంతలు ఎప్పటికప్పుడు పూడ్చి వేయాలని, ఇంటి పరిసరాల్లో పాత ఫ్రీజ్‌లు, టైర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, కూలర్స్ తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఎన్.త్రినాథ్, ఎంటిఎస్ శ్రావణి, ఏఎన్ఎం దేవి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు దోయమతి, మంగ, రాధమ్మ పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై నిరసన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ప్రజల భూములను కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను జగన్ సర్కార్ తీసుకు వచ్చిందని టిడిపి మండల అధ్యక్షులు గోకవరం కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం టిడిపి నాయకులతో కలిసి మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సాగులో ఉన్న భూములను దక్కించుకోవడానికి వైసీపీ సర్కార్ కుతంత్రాలు పన్నుతుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు డొంకిని అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో 'ఉపాధి' నిర్వీర్యం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- 'ఇండియా'ను గెలిపించాలని పిలుపు

ప్రజాశక్తి- దేవీపట్నం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, దానికి బడ్జెట్‌లో కేటాయింపులను తగ్గిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ఉప్పయ్యపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో పని ప్రదేశంలో మంగళవారం శ్రీనివాసరావు సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామపక్షాల మద్దతు నడిచిన యుపిఎ-1 ప్రభుత్వం వామపక్షాల ఒత్తిడితో ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఈ చట్టాన్ని రద్దు చేసేందుకు బిజెపి కుట్ర చేస్తుందని తెలిపారు. గిరిజనుల హక్కులను కాలరాసే విధంగా జీవో నెంబర్ 3ను రద్దు చేశారని, 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేశారని, బిజెపి ప్రభుత్వాన్ని గద్దించకపోతే ఉపాధి హామీ చట్టం కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియా వేదిక అధికారంలోకి వస్తే ఉపాధి హామీ కూలి రేటును రోజుకు రూ.400కు పెరుగుతుందని, ఏడాదికి 200 పనిదినాలు కల్పిందని చెప్పారు. పార్లమెంటు, అసెంబ్లీలో వామపక్షాల బలాన్ని పెంచితే ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక బలపరుస్తున్న సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స పాచిపెంట, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావుకు సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజానాట్యమండలి కళాకారులు తమ కళారూపాలతో కూలీలకు ఉత్తేజాన్ని కలిగించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, నాయకులు పిల్లి రామకృష్ణ, గూడేల్లి వెంకట్రావు, కే విజయలక్ష్మి, వి.సాయిబాబు, జె.గోపి, ఎస్.బుల్లెమ్మ, జి.సూర్యకిరణ్, బేబీ, చంటి పాల్గొన్నారు.


ఉపాధి పనిప్రదేశంలో వేతనదారులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నిజాయితీ పరులైన ఉద్యమకారులకు అసెంబ్లీ, పార్లమెంటుకు పంపించండి : శ్రీనివాసరావు

మారేడుమిల్లి : ఇండియా కూటమి బలపరిచిన నిజాయితీ పరులైన ఉద్యమకారులు, సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు లోతా రామారావు, అప్పలనర్స పాచిపెంటను గెలిపించి అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని వేటుకూరు పంచాయతీ పరిధి భీమవరం గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి, గిరిజన మహిళలు శ్రీనివాసరావుకి హారతి ఇచ్చి, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, ఏలూరు జిల్లా నాయకులు రామకృష్ణ, నాగమణి, నాగేశ్వరరావు, మండల నాయకులు సిరిమల్లి రెడ్డి, వీకా రాజన్న దొర, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్‌ను ఓడించాలి

ప్రజాశక్తి-చోడవరం : స్థానికేతరుడైన బిజెపి అభ్యర్థి సీఎం రమేష్‌ను ఓడించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మేకల రాములు విజ్ఞప్తి చేశారు. బీసీవై పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థితో కలిసి చోడవరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతమైన అనకాపల్లి జిల్లాలో భూకబ్జాలు, పరిశ్రమల దోపిడీకి సీఎం రమేష్ ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నాడని ఆరోపించారు. బిజెపికి ఉత్తరాంధ్రపై ప్రేమ ఉంటే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేది లేదని ప్రకటన చేయాలన్నారు. బ్యాంకులను లోటీ చేసిన సీఎం రమేష్ ఇక్కడ ప్రజా నాయకునిగా ఫోజు కొడుతున్నాడని, ఆయన్ని చిత్తుగా ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపి ముందు మోకరిల్లాయన్నారు. బీసీవై పార్టీ అభ్యర్థి నమ్మి అప్పలరాజు యాదవ్‌ను ఓట్లేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు కోడిపోయిన బాబ్జి, ఆదిలక్ష్మి, వెంకటేశ్వరరావు, వియ్యపు భూలోక

అక్రమ గ్రావెల్ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పూడిమడకలో జెట్టి నిర్మాణ పనులలో భాగంగా 40 సంవత్సరాలుగా సాగులో ఉన్న భూములలో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తమకు పరిహారం చెల్లించాలని మత్యకార కుటుంబాలు డిమాండ్ చేశాయి. మంగళవారం బాధితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పేర్ల మంగ బాపనమ్మ, అంగ కామేశ్వరి, చల్లా లక్ష్మి మాట్లాడుతూ సర్వే నెంబరు 134బి2లో 7 ఎకరాల విస్తీర్ణంలో 40 సంవత్సరాల క్రితం నుండి జీడి మామిడి, సరుగుడు తోటలు వేసి వాటిపై వచ్చే ఫలసాయంతో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమ భూములలో పల సాయానికి వచ్చినా జీడి తోటలను అక్రమంగా నరికి తరలించారని తెలిపారు. జీడి తోటలు నరికిన భూమిలో గ్రావెల్ మట్టి కాంట్రాక్టర్లు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల నుంచి మొదలుకొని జిల్లా కలెక్టర్ వరకు తమకు న్యాయం చేయాలని విన్నవించునట్లు చెప్పారు. సంబంధిత అధికారులు నేటి వరకు తమకు న్యాయం చేయలేదని వాపోయారు. ఎప్పటికైనా అధికారులు స్పందించి తమ భూములకు సంబంధించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

120 కేసుల మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండలం నర్సాపురం రెవెన్యూ దుడ్డుపాలెం బస్టాప్ వెనుక ఇటుక బట్టీ పాకలో అక్రమంగా నిల్వ ఉంచిన 120 కేసుల మద్యాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుంది. సిఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం... ముందుగా అందిన సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ నెంబర్-4 బి.సత్యంనాయుడు ఆధ్వర్యంలో దుడ్డుపాలెం బస్టాప్ వెనుక ఉన్న ఇటుకుల బట్టీ పాకలో తనిఖీలు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 120 మద్యం బాక్సులు, విడిగా గోనెసంచిలో ఉన్న 78, మొత్తంగా 5,833 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటుకల బట్టీ యజమాని కడిమి వెంకట్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని స్థానిక సిఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మద్యాన్ని గోవా రాష్ట్రం నుంచి తీసుకొచ్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందని చెప్పారు.

ఇసుక అక్రమ దందాను అరికట్టండి

- రేయింబవళ్లు యథేచ్ఛగా అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు


ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

ప్రజాశక్తి- కూనవరం : మండలంలోని గొమ్ము అయ్యవారిగూడెం గ్రామం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా సాగుతున్న ఇసుక దందాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఈ రోడ్డు ట్రాక్టర్లు దాటికి పూర్తిగా శిథిలమైపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ఇసుక దందాను ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు.